నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, ఆదివారం 22 డిసెంబర్ 2024 | KARIMNAGAR



నగరపాలక సంస్థలో విలీనం చేయవద్దంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామ ప్రజలు

## మా గ్రామాలను విలీనం చేయొద్దు

### కరీంనగర్ కలెక్టర్‌కు దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామస్తుల వినతి

కార్పొరేషన్/ కరీంనగర్‌రూరల్, డిసెంబర్ 21: కరీంనగర్ నగరపాలక సంస్థలో తమ గ్రామాలను విలీనం చేయవద్దని దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామస్తులు కలెక్టర్ పమేలా సత్పతికి విన్నవించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు మంద రాజమల్లు మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత గ్రామాలైన దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని కోరారు. తమ గ్రామాల్లో వ్యవసాయం, ఉపాధి హామీ, ఇతరత్రా వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో ఉన్నారని, నగరంలో కలిపితే వారి జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా మధ్య తరగతి ప్రజలమని, ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో పన్నులు కట్టే పరిస్థితి లేదన్నారు. ఇక్కడ దుర్శేడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, గోపాలపూర్ మాజీ సర్పంచ్ ఊరడి మంజుల మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, ఆరె శ్రీకాంత్, సింగల్ విండో మీజీ చైర్మన్ మంద రాజమల్లు, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, కోరుకంటి వెంకటేశ్వరరావు, శ్రీరామోజు తిరుపతి, గోనె నర్సయ్య, ముత్తునూరి రాజకమల్, గుండేటి కుమార్, రైతులు, ఉపాధి హామీ కూలీలు, పాల్గొన్నారు.



తన పుట్టిన రోజు సందర్భంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శనివారం బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్సారెస్పీ భూములకు ఎసరు!



- ముంపు గ్రామాల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు
- నాడు భూసేకరణ జరిగినా పహాణీల్లో భద్రం
- ఇదే అదునుగా చెలరేగుతున్న అక్రమార్కులు
- గుట్టుగా రిజిస్ట్రేషన్లు!
- తాజాగా ఫిర్యాదుతో వెలుగులోకి నుస్తులాపూర్ వ్యవహారం
- సర్వే నిలిపి వేసిన కరీంనగర్ ఆర్డీవో

**నాలుగు దశాబ్దాల క్రితం ముంపునకు గురైన ఎస్సారెస్పీ భూములపై అక్రమార్కులు కన్నేశారు. భూముల ధరలు ఆకాశన్నంటుతుండడంతో తాతలనాటి పట్టాలు వెతికి మరీ ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలో కొందరు అధికారుల సహకారంతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఇలాంటి ఉదంతమే వెలుగు చూసింది. గుట్టుగా రిజిస్ట్రేషన్ చేసిన అనంతరం భూమికి హద్దులు ఖరారు చేసే క్రమంలో విషయం బయటపడింది. స్థానికుల ఫిర్యాదుతో కరీంనగర్ ఆర్డీవో మహేశ్ కుమార్ సర్వే నిలిపి వేయించగా, ఇలానే అనేక గ్రామాల్లో ఎస్సారెస్పీ భూములను అన్యాక్రాంతం చేస్తున్నట్టు తెలుస్తున్నది.**

కరీంనగర్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మించిన దిగువ మానేరు జలాయశం (ఎల్‌ఎండీ)లో 11 గ్రామాలు పూర్తిగా, మరి కొన్ని గ్రామాలు పాక్షికంగా ముంపునకు గురయ్యాయి. అందులో నుస్తులాపూర్ గ్రామం ఒకటి! 1985–86 ప్రాంతంలో ఈ గ్రామ ముంపు బాధితులు పాత నుస్తులాపూర్ ఖాళీ చేసి, ఇదే గ్రామ శివారులో స్థిరపడ్డారు. బ్యాక్ వాటర్‌తో ఇబ్బందులుంటాయనే ఉద్దేశంతో ఈ జలాశయం 920 లెవల్ పరిధి దాటిన ఇండ్లకు కూడా కోర్టు ఆదేశాలతో అప్పుడు నష్ట పరిహారం చెల్లించారు. కానీ, కొన్ని ఇళ్ల స్థలాలను సేకరించ లేదు. ఈ విషయమై అప్పట్లో కోర్టులో దావా వేసినా.. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నది. అయితే ముంపు బాధితులు 40 ఏళ్ల కింద వదిలేసిన స్థలాలను తమవిగానే భావిస్తున్నా, పట్టా సర్టిఫికెట్లు, రిజిస్ట్రేషన్లు మాత్రం లేవు. ఎస్సారెస్పీ భూ సేకరణ విభాగం అధికారులు కూడా ఈ స్థలాలను సేకరించకపోవడంతో వాటిని పహాణీల నుంచి తొలగించలేదు. ఇదే అదునుగా కొందరు అక్రమార్కులు ఆ భూములపై కన్నేస్తున్నారు. కొందరు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని, ఈ భూములకు సంబంధించిన పాత పహాణీల్లో ఉన్న పట్టాదారులు లేదంటే వారి వారసులను వెతికి పట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. తర్వాత వ్యవసాయ యోగ్యమైన ఈ భూములను లక్షలాది రూపాయలకు అమ్మేస్తున్నారు.

### ఇక్కడ జరిగింది కూడా ఇదే..

తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో సరిగ్గా ఇదే జరిగింది. ఈ గ్రామానికి చెందిన కొందరు రజకులు 90 ఏళ్ల కింద సర్వే నంబర్ 1111లో ఇండ్లు కట్టుకుని, సుమారు 50 ఏళ్లపాటు నివసించారు. అప్పట్లో వీరు సాదాబైనామా ద్వారా స్థలాలు కొన్నారు. అయితే ఈ భూములు జలాశయం 920 లెవల్‌కు వెలుపల ఉన్నాయని భావించిన అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించ లేదు. దీంతో బ్యాక్ వాటర్ తమ ఇండ్లలోకి వస్తుందని, క్రిమికీటకాలతో తమకు ప్రాణభయం ఉందని వీరంతా కోర్టును ఆశ్రయించగా, 1994 ప్రాంతంలో అనుకూలంగా తీర్పు వచ్చింది. అప్పుడు ఇండ్లకు మాత్రమే నష్టపరిహారం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, వీరికి ఇంటి నంబర్ల మీద భూ సేకరణ చేసింది. ఒక్క 1111 సర్వే నంబర్‌లోనే 37 నివాస గృహాలకు పరిహారం చెల్లించింది. పరిహారం రావడంతో రజకులు ఈ భూములను వదిలేసి వెళ్లిపోయారు. అయితే 40 ఏళ్ల తర్వాత అంటే ప్రస్తుతం ఆ 2.20 ఎకరాల భూమికి ఇప్పుడు కొత్త పట్టాదారులు పుట్టుకొచ్చారు. రెవెన్యూ అధికారులే వీరికి రిజిస్ట్రేషన్ చేయడం ఆశ్చర్యంగా ఉన్నా.. ఇప్పుడు ఇదే సర్వే నంబర్ 1111/ఏ/1 డివిజన్‌గా విభజించి మరో వ్యక్తికి 60321 ఖాతా నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేశారు.

### ఫిర్యాదుతో వెలుగులోకి

నుస్తులాపూర్ పరిధిలోని ఈ సర్వే నంబర్‌లోని కొంత భూమిని ప్రస్తుతం కొన్ని రజక కుటుంబాల వారు అనధికారికంగా సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి 90 ఏండ్ల కింద ఉన్న పట్టాదారు వారసులు ఇప్పుడు వేరే వ్యక్తికి కొంత భాగం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. అతను తన భూమి హద్దులు ఖరారు చేయాలని సర్వే విభాగం అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. దీంతో చుట్టు పక్కల భూముల రైతులకు సదరు అధికారులు నోటీసులు జారీ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన రజకులు వెంటనే కలెక్టర్ సహా జిల్లా ఉన్నతాధికారులకు, ఆర్డీవో మహేశ్‌కుమార్‌కు నాలుగు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ భూమి సర్వేను నిలిపి వేసి, విచారణ జరపాలని తిమ్మాపూర్ తహసీల్దార్‌ను ఆర్డీవో ఆదేశించారు. దాంతో సర్వే నిలిపి వేశారు.



రిజిస్ట్రేషన్ చేసుకున్న ఎస్సారెస్పీ భూమి ఇదే

### ఎన్నో అనుమానాలు

ప్రభుత్వం ముంపు భూములకు నష్టపరిహారం చెల్లించి స్వాధీనం చేసుకున్న తర్వాత సదరు యజమానులకు ఎలాంటి హక్కు ఉండదు. సాగు, రిజిస్ట్రేషన్ చేసే అవకాశముండదు. కానీ, ఇప్పుడు నుస్తులాపూర్ ముంపు భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారం అనేక అనుమానాలకు తావిస్తున్నది. 90 ఏండ్ల కింద ఉన్న పట్టాదారుల నుంచి కొందరు రజకులు 50 ఏండ్ల కింద భూములు కొని ఇండ్లు కట్టుకున్నారు. తర్వాత ఎల్‌ఎండీ ముంపు కారణంగా ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించడంతో ఆ భూములను వదిలేసి వెళ్లిపోయారు. అలాంటి భూములను ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయడం అనేక సందేహాలను తెరపైకి తెస్తున్నది. చేతులు మారిన భూమిని, పైగా ముంపు పరిహారం చెల్లించిన భూమిని ఎలా రిజిస్ట్రేషన్ చేశారనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఆ భూమిని పాత పట్టాదారులకు విరాసత్ చేశారా..? మరోలా బదిలీ చేశారా..? అన్నది తెలియకుండా ఉన్నది. ఇలానే అనేక చోట్ల విలువైన ఎస్సారెస్పీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ఇటు రెవెన్యూ అటు ఎస్సారెస్పీ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పెద్దాపూర్ గురుకులంలోని కిచెన్‌షెడ్డులో కోడిగుడ్లను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు

## విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలి

- మెట్‌పల్లి సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు
- పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిశీలన

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 21 : పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని మెట్‌పల్లి మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, మెట్‌పల్లి సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన పాఠశాలను పరిశీలించారు. ఐదు నెలల క్రితం ఇద్దరు విద్యార్థుల మృతి, నలుగురు విద్యార్థుల అస్వస్థత, తాజాగా మరో ఇద్దరు విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలపై ఆరా తీశారు. విద్యార్థులు నిద్రించిన బెడ్లను పరిశీలించి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సిబ్బంది నుంచి పలు వివరాలను సేకరించారు. కిచెన్ షెడ్‌కు వెళ్లి నిత్యావసర సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లను పరిశీలించారు. నాణ్యత లేని సరుకులను తిప్పి పంపుతున్నారా.. లేదా? అని ఆరా తీశారు. అలాగే, గురుకుల ఆవరణను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, తమ పరిశీలన నివేదికను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, జిల్లా జడ్జితోపాటు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీకి అందిస్తామని తెలిపారు. విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు తెలిపి, మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన వెంట మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి వేణు, ఏజీపీ అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

కరీంనగర్ కలెక్టరేట్, డిసెంబర్ 21 : నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నామని కరీంనగర్ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి బీ పవన్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వెబ్ అండ్ గ్రాఫిక్ డిజైనింగ్, ఫైర్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని చెప్పారు. 18నుంచి 35ఏళ్లలోపు ఇంటర్మీడియెట్ ఆపై విద్యార్హతలున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ₹1.50 లక్షలలోపు వార్షికాదాయం ఉండాలని సూచించారు. వచ్చే నెల 20లోగా తమ దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. పూర్తి వివరాల కోసం 0878 2957085 అనే నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నమస్తే ఎఫెక్ట్

## గ్యాప్‌ల మూసివేత



గ్యాప్‌లను సిమెంటుతో మూసివేసిన గురుకుల పాఠశాల ప్రహరీ

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 21: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులంలో వరుస ఘటనలో భయం భయం నెలకొన్నది. ఈ నేపథ్యంలో 'పాముల సంచారానికి ప్రధాన ద్వారాలివిగో' శీర్షికన ఈనెల 21న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. గురుకులం ప్రహరీ పిల్లర్ల మధ్య ఉన్న గ్యాప్‌ల ద్వారా పాములు, విష పురుగులు ఆవరణ లోపలికి వచ్చే ప్రమాదమున్నదని కథనంలో వివరించింది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. శనివారం ప్రహరీ పిల్లర్ల మధ్య ఉన్న గ్యాప్‌లను సిమెంటుతో మూసివేయించారు. ఇప్పటికే పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టారు. అయితే నిరుపయోగంగా ఉన్న పాడుబడిన బావిని సైతం పూడ్చివేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## 'శ్రీసాయి' దవాఖానకు ప్రైడ్ ఆఫ్ ది నేషన్ అవార్డు

విద్యానగర్, డిసెంబర్ 21 : వైద్యరంగంలో ఉత్తమ అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నందుకుగాను ఏటా 'ఆసియా టుడే ఇండియా సంస్థ' అందజేసే 'ప్రైడ్ ఆఫ్ ది నేషన్' అవార్డు 2024కు కరీంనగర్‌లోని శ్రీసాయి లైఫ్ లైన్ మల్టీస్పెషాలిటీకి లభించింది. ఈ అవార్డుల ప్రదానోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించగా, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా దవాఖాన చైర్మన్, లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్ అవార్డు అందుకున్నారు. వైద్యరంగంలో అత్యాధునిక చికిత్సలను, ముఖ్యంగా మినిమల్ ఇన్వాసీవ్ (లాపరోస్కోపిక్, లేజర్ సర్జరీ)ని మారుమూల ప్రాంతంలోని పేదలకు ప్రదీప్ కుమార్ అందించడం అభినందనీయమని గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో దవాఖాన ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ కంచన్ తదితరులు పాల్గొన్నారు. అవార్డు రావడంపై ప్రదీప్‌కుమార్‌కు సీనియర్ వైద్యులు అభినందనలు తెలిపారు.



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్ కుమార్

## ₹1.17 కోట్లతో కొని.. వదిలేసి..!



కార్యాలయం ఆవరణలో ట్రాక్టర్లు, ట్రాలీలు.

రామగుండం నగర పాలక సంస్థలో నెల కిందట స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా దాదాపు ₹1.17 కోట్లతో కొనుగోలు చేసిన వాహనాలు ఇలా ఎండలో ఎండుతూ.. దుమ్ముతో నిండిపోయి నిరుపయోగంగా పడి ఉంటున్నాయి. ₹45 లక్షలతో ఐదు ట్రాక్టర్లు, ₹64 లక్షలతో 8 ఆటో ట్రాలీలతోపాటు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు మరో ₹7 లక్షలతో 70 చెత్త డబ్బాలను కొనుగోలు చేశారు. నెల కిందట వీటిని నగర పాలక కార్యాలయానికి తీసుకవచ్చి ఆవరణలో ఉంచారు. కానీ, ఇంతవరకు ఇవి ప్రారంభానికి నోచుకోలేదు. ఈ విషయమై నగర పాలక ఈఈ రామన్‌ను వివరణ కోరగా, త్వరలోనే వాహనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకవచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- కోల్‌సిటీ, డిసెంబర్ 21**

## మురుగుకాలువలోకి దిగి కౌన్సిలర్ నిరసన

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 21 : పెద్దపల్లి మున్సిపాలిటీలోని 12వ వార్డులో బీటీ రోడ్డు నిర్మాణానికి ముందే డ్రైనేజీ పనులు చేపట్టాలని కౌన్సిలర్ నాంసాని సరేశ్‌బాబు శనివారం మురుగు కాలువలో దిగి వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అయినందునే ఎలాంటి అభివృద్ధి పనులూ చేయడంలేదన్నాడు. బీటీ రోడ్డు పనులు పూర్తయితే నిధులు లేవనే సాకుతో కాంట్రాక్టర్ డ్రైనేజీ పనులు చేయకుండా వెళ్తాడని ఆరోపించాడు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేవరకు మురుగు కాలువలోనే ఉంటానని భీష్మించుకుని నిలబడి నిరసన తెలిపాడు. కమిషనర్ ఆకుల వెంకటేశ్ అక్కడికి వచ్చి, వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి డ్రైనేజీ పనులు చేపడుతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించాడు.



మురుగు కాలువలోకి దిగి నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ నాంసాని సరేశ్‌బాబు

## సుపారీ కోసం వచ్చి.. హత్యకు గురై!

- యూపీ యువకుడి దారుణ హత్య
- అటవీ ప్రాంతంలో పెట్రోల్ పోసి దహనం

ధర్మపురి, డిసెంబర్21 : సుపారీ తీసుకొని ఓ వ్యక్తిని హత్య చేసేందుకు వచ్చిన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలం నేరెళ్లకు చెందిన మెరుగు లక్ష్మణ్, కమలాపూర్‌కు చెందిన నేరెళ్ల గోపాల్ ముంబైలో కల్లు డిపో నిర్వహిస్తున్నారు. ఓ రోజు లక్ష్మణ్.. గోపాల్‌తో మాట్లాడుతూ తన మరదలిని తన గ్రామానికి చెందిన తోకల గంగాధర్ కొంతకాలంగా ఇబ్బంది పెడుతున్నాడని, పలుసార్లు మందలించినప్పటికీ అతడిలో మార్పు రాలేదని, అందుకే గంగాధర్‌ను చంపాలని నిర్ణయించుకున్నామని చెప్పాడు. ఎవరైనా ఉంటే సుపారీ మాట్లాడుదామని చెప్పాడు. దీనికి గోపాల్ స్పందించి తన స్నేహితుడైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్ సూర్య ప్రకాశ్‌సింగ్(27) అనే షూటర్‌కు చెబుదామని నిర్ణయించుకొని అదే రోజు ఫోన్ చేశారు. విషయం వివరించి, ఎలాగైనా గంగాధర్‌ను చంపాలని చెప్పారు. అందుకోసం ₹4 లక్షల సుపారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. గంగాధర్‌ను హత్య చేయాల్సిన తేదీ, ప్రదేశం అన్నీ సెట్ చేసుకున్నారు. తీరా సమయానికి హత్య చేయాల్సిన అవసరం లేదంటూ గోపాల్, లక్ష్మణ్ చెప్పడంతో సూర్యప్రకాశ్ సింగ్ తీవ్ర ఆవేశానికి లోనై గోపాల్‌ను బెదిరించసాగాడు. హత్య చేసినా చేయకున్నా ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాల్సిందేనని, లేదంటే మీ తండ్రి రమేశ్‌ను చంపుతానని గోపాల్‌ను బెదిరించాడు. దీంతో భయపడ్డ అతడు షూటర్‌ను నమ్మించి అకౌంట్ సెటిల్ చేస్తానని ఈనెల 12న ముంబై నుంచి నేరెళ్లకు తీసుకువచ్చాడు. ఈ నెల 13న రాత్రి 11.30 గంటల సమయంలో పథకం ప్రకారం సూర్యప్రకాశ్‌ను నేరెళ్లకు చెందిన గండికోట శేఖర్ సహకారంతో నేరెళ్ల అటవీప్రాంతంలో ఉన్న సాంబశివుని గుడి వద్దకు కారులో తీసుకువచ్చారు. గుడి సమీపంలో గోపాల్, శేఖర్, సూర్య ప్రకాశ్ మద్యం తాగారు. శేఖర్ సూర్య ప్రకాశ్‌ను మాటల్లో పెట్టగా, గోపాల్ ఒక పెద్ద బండరాయి తెచ్చి సూర్యప్రకాశ్ తలపై మూడుసార్లు బలంగా మోది హత్య చేశాడు. ఎవరైనా వచ్చి గుర్తుపడతారేమోననే భయంతో మృతదేహాన్ని కారులో వేసుకొని నేరెళ్ల–బట్టపల్లి అటవీప్రాంతంలోకి తీసుకెళ్లారు. కట్టెలు వేసి, పెట్రోల్ పోసి మృతదేహాన్ని దహనం చేశారు. అయితే, పూర్తిగా దహనమైందో లేదోననే అనుమానంతో మరుసటి రోజు 14న ఉదయం వెళ్లి చూశారు. కొంత భాగం కాలకపోవడంతో మళ్లీ కట్టెలు పోగు చేసి పెట్రోల్‌పోసి అంటించారు. అయితే, గ్రామానికి కొత్తగా కార్లు రావడం, రెండు రోజుల కిత్రం వీరితో తిరగిన వ్యక్తి కనిపించకపోవడంతో గ్రామంలో కలకలం మొదలైంది. ఈ విషయం పోలీసులకు చేరడంతో విచారణ ముమ్మరం చేశారు. దీంతో భయాందోళనకు గురైన గోపాల్, శేఖర్ శనివారం ధర్మపురి పోలీస్ స్టేషన్‌కు వచ్చి సూర్యప్రకాశ్‌ను తాము హత్య చేసినట్లు లొంగిపోయారు. హత్య జరిగిన ఘటనా స్థలానికి జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ధర్మపురి, బుగ్గారం ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. అనంతరం నేరెళ్ల–బట్టపెల్లి అటవీ ప్రాంతంలో దహనం చేసిన ప్రదేశానికి వెళ్లారు. బూడిద తప్ప ఎలాంటి ఆనవాళ్లు కనిపించడకుండా బుగ్గి చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.

## గ్రానైట్ లారీ బీభత్సం

- రోడ్డు వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఢీ.. నుజ్జునుజ్జు
- విరిగిన స్తంభాలు.. తీగలు చెల్లాచెదురు



డబుల్ బెడ్ రూం రోడ్డు డ్రైనేజీకి తట్టుకొని ఆగిన లారీ

కొడిమ్యాల, డిసెంబర్ 21: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాల వద్ద ఓ గ్రానైట్ లారీ బీభత్సం సృష్టించింది. అతివేగంగా వచ్చి డబుల్ బెడ్రూం ఇండ్లకు విద్యుత్ కోసం అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయ్యాయి. స్తంభాలు విరిగిపోయాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రానైట్ క్వారీ నుంచి శనివారం మధ్యాహ్నం ఓ లారీ గ్రానైట్ బండ (సుమారు 150 టన్నులు)తో పూడూరు వైపు వెళ్తున్నది. చెప్యాల డబుల్ బెడ్రూం ఇండ్ల మూలమలుపు వద్దకు చేరుకోగానే, అతివేగంగా అదుపు తప్పింది. రోడ్డు పక్కన డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఏర్పాటు చేసిన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, 15 కేవీ చిన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అవి దెబ్బతిన్నాయి. మూడు విద్యుత్ పోల్స్ విరిగి, తీగలు చెల్లాచెదురయ్యాయి. లారీ వెనకాల ట్రాలీ ఊడిపోవడంతో బండ ఎగిరివచ్చి డబుల్ బెడ్రూం ఇండ్లకు వెళ్లే సీసీ రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లను ఢీకొట్టిన టైంలో కరెంట్ కట్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, లారీ బీభత్సంతో ట్రాన్స్‌కోకు ₹7.20లక్షల నష్టం వాటిల్లిందని ట్రాన్స్‌కో ఏడీఈ మహేందర్, ఏఈ రఘునాథ్ తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ వినోద్‌కుమార్ పటేల్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సందీప్ తెలిపారు.

## అత్యాశకు పోతే అసలుకే ఎసరు

- గుప్తనిధుల పేరిట కొండగట్టులో మహిళకు ఎర
- దఫదఫాలుగా ₹46 లక్షల వసూలు చేసి పరారు

మల్యాల, డిసెంబర్ 21 : అత్యాశకు పోతే అసలుకే ఎసరు వచ్చింది. గుప్తనిధులకు ఆశపడి నిండా మునిగింది. పదిహేను రోజుల క్రితం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నరేశ్ వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి రెండేళ్ల క్రితం కొండగట్టుకు చెందిన ఓ స్థానిక మహిళ వద్దకు వచ్చి, పూజారి పేరిట పరిచయం చేసుకున్నాడు. ఈ ప్రాంతంలో చాలా గుప్తనిధులు ఉన్నాయని, 3 కిలోల బంగారం దొరుకుతుందని ఆశపెట్టాడు. అయితే ఇది వెలికి తీయాలంటే పూజలు చేయాలని, అందుకు ఖర్చవుతుందని చెప్పాడు. తన ఆధార్ కార్డును సైతం చూపించాడు. దీంతో ఆ మహిళ నమ్మింది. రెండేళ్ల నుంచి పూజల కోసమని దఫ దఫాలుగా ₹46 లక్షలు అప్పగించింది. ఆ వ్యక్తి పదిహేను రోజుల క్రితం కొండగట్టు ప్రాంత శివారులో ఒక గుంతను తవ్వి, అందులో నుంచి ఓ కుండను వెలికితీసి దూరం నుంచి బంగారు బిల్లలను చూపించాడు. పూజలు చేసిన తర్వాత అప్పగిస్తానని చెప్పి పత్తాలేకుండా పోయాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తాను మెసపోయానని ఆ మహిళ లబోదిబోమన్నది. పదిహేను రోజుల క్రితమే మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ విషయం తాజాగా వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.